

## మంచినీళ్లు ఇవ్వండి
# మహాప్రభో!

బండ్లగూడ, జూలై 8: నగరంలో నీటి ఎద్దడి తీవ్రతరమవుతున్న నేపథ్యంలో జలమండలి అధికారులకు నగరవాసుల నుంచి నిరసనలు ఎదురవుతూనే ఉన్నాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బండ్లగూడలోని కాళికానగర్‌లో చాలా రోజులుగా 3-4 రోజులకొకసారి నీళ్లు వస్తున్నాయి. కాగా తమకు రోజు విడిచి రోజు మంచినీళ్లు ఇవ్వాలని జలమండలి మేనేజర్ శ్రీనివాస్‌ను కాళికానగర్ కాలనీవాసులు నిలదీశారు.

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, మంగళవారం 9 జూలై 2024 | HYDERABAD

• డంపింగ్ యార్డులా ఎన్టీఆర్ స్టేడియం



ఎన్టీఆర్ స్టేడియంలో పారిశుద్ధ్య పర్యవేక్షణ కరువైపోవడంతో రోజురోజుకూ అక్కడ వ్యర్థాలు పోగవుతున్నాయి. ఆటలు ఆడుకునే స్థలం ఇప్పుడు డంపింగ్ యార్డులా తయారవడంతో స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

## జీహెచ్ఎంసీ పరిధిలో..
# ఈ ఏడాది 30 లక్షల మొక్కలు
### నేడు 56 చోట్ల 7వేలు..
పచ్చటి మొక్కలతోనే భవిష్యత్తు తరాలకు భరోసా
వన మహోత్సవ ప్రారంభోత్సవంలో మంత్రి పొన్నం

ఉప్పల్, జూలై 8 : పచ్చటి మొక్కలు నాటడమంటే భవిష్యత్తు తరాలకు మంచి భరోసా ఇవ్వడమేనని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా ఉప్పల్ సర్కిల్ రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాలలోని మైదానంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర వ్యాప్తంగా ఈ ఏడాది మొత్తం 30 లక్షల మొక్కలు నాటుతామని మంగళవారం 30 సర్కిళ్లలో 56 చోట్ల 7134 మొక్కలు నాటుతామని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే బాధ్యతను స్వీకరించాలని, నాటడంతో పాటు, వాటి సరంక్షణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, హర్టికల్చర్ అడిషనల్ కమిషనర్ సునందా రాణి, డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, ఈఈ నాగేందర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతాప్రవీణ్, కార్పొరేటర్లు శాంతీ సాయిజెన్ శేఖర్, పన్నాల దేవేందర్ రెడ్డి, జెర్రిపోతుల ప్రభుదాస్, కక్కిరేణి చేతన, మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి, బొంతు శ్రీదేవి, కాలనీవాసులు పాల్గొన్నారు.




వనమహోత్సవంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, డిప్యూటీ మేయర్ శ్రీలత, బల్దియా కమిషనర్ ఆమ్రపాలి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

## మేమేమైనా రోబోలమా?
### వెంటవెంటనే పరీక్షలు రాయడం సాధ్యమా?

వెంటవెంటనే పరీక్షలు రాయడం తమకు ఎలా సాధ్యమవుతుందంటూ ప్రశ్నిస్తూ డీఎస్సీ పరీక్షలను 3 నెలలు వాయిదా వేయాలని కోరుతూ సోమవారం నగర వ్యాప్తంగా అభ్యర్థులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖ ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించేందుకు బయలుదేరిన డీఎస్సీ అభ్యర్థులు



# నిల్చునేందుకూ స్థలం లేదు

### రద్దీ సమయాల్లో కిక్కిరిసిపోతున్న మెట్రో రైళ్లు
అయినా సర్వీసులను పెంచని ఎల్అండ్‌టీ

సిటీబ్యూరో, జూలై 8 (నమస్తే తెలంగాణ): రోజురోజుకూ ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నా మెట్రో సర్వీసులను పెంచేందుకు మాత్రం ఎల్అండ్‌టీ ససేమిరా అంటున్నది. అందుబాటులో ఉన్న మెట్రో కోచ్‌లతోనే నెట్టుకు వస్తున్నది తప్ప, కొత్త కోచ్‌లను తీసుకువచ్చేందుకు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా మెట్రో రైళ్లలో బాగా రద్దీ పెరిగిపోతున్నది. ఉదయం ఉదయం 8.30 గంటల నుంచి 11 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల మధ్య మియాపూర్ నుంచి ఎల్బీనగర్ మార్గంలో, రాయదుర్గం నుంచి అమీర్‌పేట మార్గంలో మెట్రో రైళ్లలో నిల్చునేందుకు కూడా స్థలం ఉండడం లేదని మెట్రో ప్రయాణికులు వాపోతున్నారు. ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే మెట్రో రైళ్ల సంఖ్యను రద్దీకి అనుగుణంగా పెంచాలని నగరవాసులు సూచిస్తున్నారు. ప్రధానంగా రాయదుర్గం నుంచి అమీర్‌పేట వరకు ఉన్న మార్గంలో ప్రతి 3 నిమిషాలకు ఒక రైలును నడుపుతామని మెట్రో అధికారులు చెప్పినా, మెట్రో రైళ్ల ఫ్రీక్వెన్సీ మాత్రం అందుకు అనుగుణంగా ఉండడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మెట్రో అధికారులు రద్దీ సమయాల్లో నిర్దేశిత మార్గాల్లో అదనపు రైళ్లను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### ట్రాకుల వద్ద లైన్ దాటి..

మరోవైపు.. రద్దీ సమయాల్లో మెట్రో స్టేషన్ ప్లాట్‌ఫామ్‌లు ప్రమాదకరంగా మారాయి. రద్దీ అధికంగా ఉండే పలు మెట్రో స్టేషన్‌లలో ప్రయాణికులు రైలు ఎక్కే సమయంలో ప్లాట్‌ఫాం వద్ద నిర్ణయించిన ట్రాక్ లైన్ దాటి ముందుకు వెళ్లి నిలబడుతున్నారు. పెరిగిపోతున్న రద్దీతో మార్కింగ్‌కు లైన్‌కు అవతల ప్రతి నిమిషానికి జనం పెరిగిపోతూ ఉండడంతో సిబ్బంది నియంత్రించలేకపోతున్నారు. మెట్రో రైలు వచ్చే సమయంలో ప్రయాణికులందరూ ఒకేసారి డోర్‌వైపు కదులుతుండడంతో తోపులాటి జరిగి ప్రమాద వశాత్తూ ట్రాక్‌పైన పడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## పారిశుద్ధ్య పనివేళల్లో మార్పులు

సిటీబ్యూరో, జూలై 8 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పనివేళల్లో మార్పులు చేసినట్లు జీహెచ్ఎంసీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం వేసవి సీజన్ ముగియడంతో ఇక నుంచి పారిశుధ్య కార్మికులు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పారిశుధ్య పనులు చేయాల్సి ఉంటుందని, బయో మెట్రిక్ హాజరును ఉదయం 5 నుంచి 6 గంటల మధ్య, తిరిగి మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల మధ్య నమోదు చేయాల్సి ఉంటుందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశాలు జారీ చేశారు.



## రెండ్రోజులు మోస్తరు వానలు

సిటీబ్యూరో, జూలై 8 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా ఆవర్తన ప్రభావంతో నగరంలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 30.1డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23.7డిగ్రీలు, గాలిలో తేమ 68శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

# భూమి లేకపోయినా పాస్‌బుక్

7 గుంటల భూమి ఉన్నట్టు ధరణిలో రికార్డు
### తప్పు ధరణిదా? ఎమ్మార్వోదా?

శంషాబాద్ రూరల్, జూలై 8 : భూమి లేకపోయినా ఓ వ్యక్తికి 7 గుంటల భూమి ఉన్నట్టు పట్టాదారు పాస్‌బుక్ రావడంతో శంషాబాద్ మండలంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. శంషాబాద్ మండలంలోని జూకల్ గ్రామ రెవెన్యూ పరిధిలోని అలీకోల్‌తండాకు చెందిన కేతావత్ పూర్యా నాయక్‌కు సర్వే నంబర్ 192లో 1 ఎకరాల 38 గుంటల భూమి ఉండేది. అయితే 2008లోనే అతడు తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం ఆ భూమిని మరొకరికి విక్రయించాడు. కాగా, కేతావత్ పూర్యానాయక్‌కు అక్కడే 7 గుంటల భూమి ఉన్నట్లు ధరణి రికార్డుల్లో ఉంది. ఈ మేరకు ఎమ్మార్వో నాగమణి పూర్యా నాయక్‌కు పట్టాదారు పాస్‌బుక్కును పంపిణీ చేశారు. భూమి లేకపోయినా పట్టాదారు పాస్‌బుక్ చేతికి అందడంతో పూర్యానాయక్ సోమవారం ఆ భూమిని స్వాధీనం చేసుకోవడానికి వచ్చాడు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. ఇది ధరణి తప్పిదమా లేక ఎమ్మార్వో నాగమణి చేసిన తప్పిదమా తెలియక 7 గుంటల భూమి కోల్పోయిన వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా లేని భూమికి పట్టాదారు పాస్‌బుక్కులు ఇచ్చిన తహసీల్దార్ నాగమణిపై చర్యలు తీసుకోవాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు. ఇరువర్గాలు మధ్య జరిగిన ఘర్షణ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. తహసీల్దార్ నాగమణి వివరణ కోసం సంప్రదించగా ఆమె అందుబాటులోకి రాలేదు.



పూర్యానాయక్ గతంలో అమ్ముకున్న భూమి పత్రాలను చూపుతున్న స్థానిక గిరిజన నాయకులు, రైతులు



బల్కంపేట ఎల్లమ్మ తల్లికి గద్వాల పట్టుచీర అందజేస్తున్న జములమ్మ ఆలయ కమిటీ

## అమ్మవారికి గద్వాల పట్టుచీర

గద్వాల రూరల్: నగరంలోని బల్కంపేట ఎల్లమ్మ తల్లికి గద్వాల నేత పట్టుచీరను నడిగడ్డ ఇలవేల్పు జములమ్మ ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. రాష్ట్ర రాజధానిలో సోమవారం పట్టుచీరను అందజేసిన ఆలయ కమిటీ చైర్‌పర్సన్ గాయత్రీ సతీశ్ కుమార్ అనంతరం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జములమ్మ ఆలయ డైరెక్టర్ ఓం ప్రకాశ్ కాంబ్లే, రంగస్వామి, తోట రాముడు, రవి పాల్గొన్నారు.

### భూమికి 10 అడుగుల దిగువన..


భక్తుల ఆరాధ్య దేవతగా వెలుగొందుతున్న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారు భూమి ఉపరితలానికి 10 అడుగుల దిగువన నిద్రిస్తున్న రూపంలో స్వయంభువుగా వెలసింది. ఈ ఆలయంలో అమ్మవారి మూల విగ్రహం వెనుక భాగం నుంచి నిత్యం నీటి ఊటలు ఉంటాయి. ఎటువంటి కాలంలో అయినా ఈ నీటి ఊటలు సంభవిస్తుంటాయి. చారిత్రక ఆధారాల ప్రకారం, దాదాపు 700 సంవత్సరాలకు పూర్వమే ఇక్కడ అమ్మవారు వెలసినట్టు చెబుతారు.

# బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం నేడే

ఉదయం 11.34 ని॥లకు ముఖ నక్షత్రయుక్త అభిజిత్ లగ్నం
భూమికి 10 అడుగుల దిగువన వెలసిన అమ్మవారు

అమీర్‌పేట్, జూలై 8: కొలిచిన వారి కొంగు బంగారంగా విరాజిల్లుతున్న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం మంగళవారం జరుగనుంది. సోమవారం నుంచి ప్రారంభమైన ఈ వేడుకలు మూడు రోజుల పాటు జరుగుతాయి. సోమవారం ఉదయం గణపతి పూజతో కల్యాణోత్సవ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం అమ్మవారికి ఎదుర్కోళ్లు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేడుకల్లో ప్రధాన ఘట్టమైన ఎల్లమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవం మంగళవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని, 11.34 నిమిషాలకు ముఖ నక్షత్రయుక్త అభిజిత్ లగ్న సుముహూర్తమున వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు దేవాలయ ఈవో కె.అంజనీదేవి తెలిపారు. లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు క్యూ లైన్లలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు మహాశాంతి చండీ హోమం, సాయంత్రం ఆరు గంటలకు ఎల్లమ్మ అమ్మవారిని రథంపై పురవీధుల్లో ఊరేగిస్తారు.







అమ్మవారి కల్యాణానికి సీఎస్ శాంతికుమారి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్‌లను ఆహ్వానిస్తున్న బల్కంపేట పూజారులు

### • అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు: తలసాని

అమ్మవారి కల్యాణోత్సవానికి తరలివచ్చే భక్తజనులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రభుత్వం తరపున ఏర్పాట్లు జరుగుతున్నా, స్థానికుల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఎమ్మెల్యే తలసాని అన్నారు. రాజకీయంగా చోటు చేసుకున్న మార్పుల ప్రభావం కల్యాణోత్సవంపై పడకుండా స్థానికులు అంతా కలిసి పని చేయాలన్నారు. పలు వ్యక్తిగత కారణాల దృష్ట్యా తాను వేడుకల ఏర్పాట్లపై ఆశించినంత మేర ప్రత్యక్ష పర్యవేక్షణ చేయలేకపోయానని, అయినా భక్తుల సేవలో బల్కంపేట వాసులంతా తమ వంతు భాగస్వామ్యాన్ని అందించేందుకు ముందుకు రావాలన్నారు.

## విచక్షణారహితంగా చితకబాది..

జలమండలి లైన్‌మన్‌పై కాంగ్రెస్ కార్పొరేటర్ దౌర్జన్యం
తీవ్రగాయాలు

మణికొండ, జూలై 8: విధులు నిర్వహిస్తున్న జలమండలి లైన్మన్‌పై కాంగ్రెస్ కార్పొరేటర్ విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఈ ఘటన నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. కోకాపేట ప్రాంతానికి చెందిన పెసరి శ్రీధర్ జలమండలి మణికొండ డివిజన్‌లో నీటి సరఫరా లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. కోకాపేటలోని అక్షయ పాత్ర సమీపంలో నీటిని విడుదల చేసేందుకు వెళుతుండగా కాంగ్రెస్ పార్టీకి చెందిన 5వ వార్డు కౌన్సిలర్ శివారెడ్డి అడ్డుకొన్నాడు. రాజీవ్ గృహకల్పకు వాటర్ ఎందుకు సరఫరా చేయడం లేదంటూ ప్రశ్నించాడు. ఆ ఏరియా తన పరిధిలోకి రాదని, మరో లైన్‌మ్యాన్ సరఫరా చేస్తాడని చెప్పాడు. అయినా.. శ్రీధర్ మాట వినకుండా శివారెడ్డి బలవంతంగా తన వాహనంపై ఎక్కించుకునేందుకు ప్రయత్నించాడు. శ్రీధర్ వాహనం ఎక్కకపోవడంతో చెంపపై కొట్టాడు. అనంతరం తన అనుచరులకు ఫోన్ చేసిన శివారెడ్డి మరో 10 మందిని అక్కడికి రప్పించుకున్నాడు. వారంతా బైక్‌లపై వచ్చి శ్రీధర్‌ను విచక్షణా రహితంగా చితకబాదారు. ఈ ఘటనలో శ్రీధర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం శ్రీధర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నార్సింగ్ పోలీసులు తెలిపారు.